మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచాలి : డీఈఓ గోవిందరాజులు



విద్యార్థుల శక్తి సామర్థ్యాలను పరిశీలిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 06 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు తమ విద్యార్థుల బలాలు, బలహీనతలను అంచనా వేసి ఉత్తమ అభ్యాసాలను అనుసరిస్తూ మార్గనిర్దేశం చేసి రోల్ మోడల్స్‌గా వ్యవహరించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. గురువారం బిజినపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను డీఈఓ గోవిందరాజులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం అందుతున్న తీరుపై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇటీవల అందజేసిన నోట్ పుస్తకాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి నోట్ పుస్తకాలను అందజేయాలని ఆదేశించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయులే అంతిమ రోల్ మోడల్‌గా వ్యవహరించాలన్నారు. విద్యా జీవితంలో విద్యార్థులు వివిధ రకాల ఉపాధ్యాయులను చూస్తారు. ఒక గొప్ప ఉపాధ్యాయుడు తన విద్యార్థుల పట్ల ఎల్లప్పుడు మద్దతుగా ప్రతి అంశంలో విద్యార్థి విజయాలను అభినందిస్తూ విద్యార్థులతో అమూల్యమైన అనుబంధాన్ని కలిగి ఉంటూ ఎల్లప్పుడు ప్రొత్సహించే ఉపాధ్యాయులను విద్యార్థులు జీవితంలో రోల్ మోడల్స్‌గా అనుకరిస్తారన్నారు. తరగతి గదిలో శక్తివంతమైన విద్యా అందించడమే కాకుండా విద్యార్థుల సమస్యలను విని విలువైన నైపుణ్యాలను బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం మెరుగైన వసతులను కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థులకు దినపత్రికలు, పుస్తకాలు చదివే అలవాటు చేయాలన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించిన జిల్లా ఎస్పీ రక్షిత

**వనపర్తి క్రైమ్, జూలై6, ప్రభాతవార్త:** వనపర్తిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి బాధితులకు అప్పగించారు. సెల్‌ఫోన్ బాధితులను ఎస్పీ కార్యాలయానికి గురువారం పిలిపించారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ప్రవేశపెట్టిందని ఇందుకోసం వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని, అందులో రెక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/ స్టోలెన్ మొబైల్ లింక్ కనబడుతుందని తెలిపారు. చివరగా సెల్ (చరవాణి) పోయిన వెంటనే తమ పరిధిలోని పోలీసులకు సమాచారం అందించాలని, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ అప్లికేషన్ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఈ పోర్టల్ ద్వారా వనపర్తి జిల్లాలోని మొత్తం 521 ఫోన్లు మిస్సింగ్ అయ్యాయని కంప్లైంట్ రాగా అందులో 72 ఫోన్‌లు ట్రేస్ చేయడం జరిగిందని , 29 ఫోన్లు ఫిర్యాదుదారులకు అందజేయడం జరిగిందని ఆమె తెలిపారు. గతంలో 43 ఫోన్లు ఫిర్యాదుదారులకు అందజేయడం జరిగిందని, మిగతా ఫోన్లు కూడా ట్రేస్ చేసి ఫిర్యాదుదారులకు అందజేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్, వనపర్తి డీఎస్పీ ఆనంద్ రెడ్డి, సీఐ మహేశ్వర్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి



బాధితులకు సెల్‌ఫోన్లను అందజేస్తున్న జిల్లా ఎస్పీ

## మహనీయుల స్ఫూర్తితో సమాజ సేవకు కృషి చేద్ధాం...

**- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రాం వర్ధంతి**

**- ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**అచ్చంపేట, జూలై 06 ప్రభాతవార్త:** మహనీయుల స్ఫూర్తితో సమాజ సేవకు కృషి చేద్ధామని ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో వారు కీలక పాత్ర పోషించారని, 1973లో బీహార్ శాసనసభకు ఎన్నికై ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. ముఖ్యంగా వారు 1971 ఇండో పాక్ యుద్ధం నిర్వహించిన సమయంలో భారత రక్షణ మంత్రిగా కొనసాగారని, భారతదేశంలో హరితవిప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో వారు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహగౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు మనోహర్, స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కిడ్స్ కేర్ చిన్న పిల్లల ఆసుపత్రి ప్రారంభం...** పట్టణంలోని బస్టాండ్ సమీపంలో డాక్టర్ మోతిలాల్ నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్స్ కేర్ చిన్న పిల్లల ఆసుపత్రిని గురువారం ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పూజ కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రిని ఏర్పాటు చేసిన డాక్టర్ మోతిలాల్ దంపతులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. చిన్న పిల్లలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆసుపత్రి నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## సమ్మె బాట..!

**- జీతాలు పెంచాలంటూ ఆదోళన..**
**- గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన దీక్షలు..**
**- తెలంగాణ ఉద్యోగ కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహణ**
**- ఉమ్మడి జిల్లాలో విధులు బహిష్కరణ**
**- మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు..**



జడ్చర్లలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి తెలుగు సత్తయ్య



బాలానగర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త :** పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టారు. గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన దీక్షలకు దిగారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు దీక్షలు చేపట్టారు. సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసి, ఐఎఫ్‌టీయూ మద్దతు తెలిపాయి. ఈసందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో భూత్పూర్, రాజాపూర్, బాలానగర్, జడ్చర్ల మండల కేంద్రాల్లో సమ్మె నిర్వహించారు. జడ్చర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి తెలుగు సత్తయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భారీ కృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. విధులో సిబ్బంది ప్రాణాలుకోల్పోతే నష్టపరిహారం ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం స్వచ్ఛభారత్‌పేరుతో యాడ్స్‌కు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రజాధనం వృధా చేస్తుందని, పెట్టుబడిదారులకు ప్రభుత్వసంస్థలను కారుచౌకగా అమ్మేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బాలానగర్‌లో నిర్వహించిన సమ్మెలో** సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల శ్రమను గుర్తించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ఇవీ డిమాండ్లు..

- **పంచాయతీ కార్మికుల కనీస జీతాలు రూ.26 వేలు ఇవ్వాలి.**
- **జీవో నెంబర్ 51 రద్దు చేయాలి.**
- **మల్టీపర్పస్ విధానాన్ని తీసివేయాలి.**
- **పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి.**
- **దహన సంస్కారాల కింద రూ.10వేలు అందజేయాలి.**
- **రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలి.**
- **గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలి**
- **జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలి**

**పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 06 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రామాల్లో పంచాయతీ కార్మికులు వివిధ రకాల పనులు నిర్వహిస్తున్నారని, అలాంటి వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదని, సక్రమంగా ప్రతి నెల జీతాలు చెల్లించడం లేదని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని సీఐటీయూ జిల్లా నాయకులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెకు దిగారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా సీఐటీయూ, సీపీఐ, వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా చెప్పుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పారిశుధ్య కార్మికులు ప్రభుత్వం దృష్టికి ఎన్నో రకాల డిమాండ్లను తీసుకొచ్చారని, వాటన్నింటిని వెంటనే ప్రభుత్వం నేరవేర్చాలనివారు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం, అలాగే మృతి చెందిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, సహజ మరణానికి రూ.5లక్షలు చెల్లించాలని, ఈపీఎఫ్, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వం కార్మిక చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మెకు అండగా ఉంటామని, ప్రభుత్వం దిగివచ్చి పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేంత వరకు పోరాటం చేసేందుకు వారి తరుపున సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

**పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి..**

**ఇటిక్యాల, జూలై06 ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, అలాగే జీవో నెం.60ప్రకారం జీతాలు చెల్లించాలని, ప్రభుత్వఉద్యోగుల తరహాలోనే అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని బీఎస్పీపార్టీ జిల్లా అధ్యక్షులు కేశవ రావు, ఏఐటీయూసీ జిల్లాఅధ్యక్షులు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నుంచి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్యకార్మికులు, వారి సమస్యల పరిష్కారం కొరకు నిరవధిక సమ్మె మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికుల సమ్మెకు బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు కేశవరావు, జిల్లా ఇన్‌చార్జి ఎంజి.కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు హాజరైవారికిమద్దతు పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతర్వాత గ్రామాల్లో పంచాయతీ కార్మికులు బీద రకాల పనులు నిర్వహిస్తున్నారని, అలాంటి వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదని, సక్రమంగా ప్రతి నెల జీతాలు చెల్లించడం లేదని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. ధనికరాష్ట్రంగా చెప్పుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పారిశుధ్య కార్మికులు ప్రభుత్వం దృష్టికి ఎన్నో రకాల డిమాండ్లను తీసుకొచ్చారని, వాటన్నింటిని వెంటనే ప్రభుత్వం నేరవేర్చాలనివారు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం, అలాగే మృతిచెందిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వఉద్యోగం, సహజ మరణానికి రూ.5లక్షలు చెల్లించాలని, ఈపీఎఫ్, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని, సమానపనికి సమానవేతనం చెల్లించాలని, ప్రభుత్వం కార్మిక చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మెకు అండగా ఉంటామని, ప్రభుత్వం దిగివచ్చి పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేంత వరకు పోరాటం చేసేందుకు వారి తరుపున సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ సలహాదారు బల్గేరా సురేష్, అలంపూర్ తాలూకా అధ్యక్షులు తిరుపాల్, మండల పార్టీ అధ్యక్షులు యువరాజు, ఏఐటీయూసీ నాయకులు ఆశన్న, రంగన్న, మండల పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షులు వెంకట్రామ్‌రెడ్డి, గణేష్, రాజు, శేఖర్, ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులు తదితరులు ఉన్నారు.

**మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ**

**వనపర్తి టౌన్, జూలై6, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం సమ్మె నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కార్మికులు హక్కుల సాధన కోసం సమ్మెలోకి వెళ్లారని, సమ్మె ద్వారా తమ హక్కులను సాధించుకోవాలని తెలిపారు. కార్మికులు ఆగ్రహాలకు గురికాకముందే సమస్యలు పరిష్కారం చేసి కార్మికులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, నాయకులు మద్దిలేటి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి రాంచంద్రయ్య, అధ్యక్షులు శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ కార్మికులు రాజు, సతీష్, నారమ్మ, హనుమంత్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు



సమ్మెకు మద్దతు తెలిపిన పలువురు నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

## నడిగడ్డ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది..

**- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి - సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు**

**గద్వాల ప్రతినిధి, జూలై 6, ప్రభాతవార్త :** నడిగడ్డ ప్రజల దశాబ్దాల కల నెరవేరిందని, సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు విద్యార్థిలోకం, జిల్లా ప్రజలు రుణపడి ఉంటారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు చేయడాన్ని హర్షిస్తూ జిల్లా కేంద్రంలో బండ్లకృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలోనే గద్వాలకు విద్యా ప్రాముఖ్యత పెరిగిందని, గతంలో నర్సింగ్ కళాశాల మంజూరు కావడంతో రెండు సంవత్సరాలు పూర్తయిందన్నారు. గత ప్రభుత్వాలు గద్వాలను పట్టించుకోలేదన్నారు. గద్వాల పట్టణంలో గద్వాల బస్టాండ్, కృష్ణావేణి చౌరస్తా గుండా ప్రైవేట్ , ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనే మూడు మెడికల్ కళాశాలలే ఉండేవని సీఎం కేసీఆర్ హయాంలో ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం ఆయన దూర దృష్టికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్, ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల

## మన ఊరు - మన బడి పనులను వెంటనే పూర్తి చేయాలి: కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి, జూలై 6, ప్రభాతవార్త :** మన ఊరు మన బడి పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పంచాయతీ రాజ్ ఈఈ, డీఈ, ఏఈలతో ఆమె మాట్లాడారు. మన ఊరు మన బడి కింద 161 పాఠశాలలు ఎంపిక చేస్తే కేవలం 11 పాఠశాలలను మాత్రమే ప్రారంభించుకున్నామని మిగతా పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, తరగతి గదులు, ఇతరత్రా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టిన బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానల పనులు ఎంత వరకు వచ్చాయని, పనులు పూర్తి చేసి రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్వ చౌహాన్, డీఈవో సిరాజుద్దీన్, డీఎంహెచ్‌వో శశికళ, ఈఈ ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## అసంపూర్తి పనులు... అవస్థలో ప్రజలు..!

## కంకర పరిచారు.. బీటీ మరిచారు..!

**వెల్దండ, జూలై 06 ప్రభాతవార్త:** మండల కేంద్రం నుంచి చారకొండకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వాన్నంగా తయారైంది. చెదురుపల్లి-భైరాపూర్ గ్రామ పరిధిలో గల బీటీ రోడ్డుపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జి పనులు పూర్తి కావడంతో కంకర పరిచి బీటీ రోడ్డును కాంట్రాక్టర్ మరిచిపోవడంతో వాహనాలు తిరిగి గుంతలమయంగా ఏర్పడటంతో దీంతో రోడ్లపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ప్రయాణించాలంటే ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంకర పరిచి బీటీ మరిచిపోవడంతో ప్రయాణం నరకయాతనగా తలపిస్తుందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో బీటీ రోడ్లు చాలా తక్కువగా ఉన్నాయని, ఉన్న రోడ్లు సైతం నిర్వహణ సరిగ్గా చేయక కంకర తేలి గుంతల మయం కావడంతో ప్రయాణించాలంటే ప్రమాదకరంగా మారాయి. స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం జరుగుతుందని, కంకర పరిచి బీటీ వేయకపోవడంతో దుమ్ము, దూళి తలెత్తి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. రోడ్డు తవ్విన పనుల వద్ద అసంపూర్తిగా వదిలేయడంతో పాటు ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా సూచిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు సూచించి త్వరితగతిన బీటీని వేసి ప్రయాణీకుల ఇక్కట్లను దూరం చేయాలన్నారు. ఇట్టి విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ లక్ష్మిపతిని వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు గత మూడు రోజుల క్రితమే పిలిపించి మాట్లాడామని, ప్రయాణీకుల అవసరాల దృష్టిలో పెట్టుకొని పనులను పూర్తి చేయాలని సూచించామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రయాణాన్ని సులభతరం చేస్తామన్నారు.



కంకర వేసి బీటీ వేయకుండ ఉన్న దృశ్యం

### బీటీని పూర్తి చేసి ప్రయాణీల ఇబ్బందులను తొలగించాలి...



**రహదారిని గత రెండు సంవత్సరాల క్రితం అసంపూర్తి పనులు చేపట్టి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తి పనులు జరిగాయని, కంకర పరిచి బీటీ వేయకపోవడంతో నిత్యం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఒక్కోసారి ప్రయాణీకులు కంకర తేలిన గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బీటీని ఇప్పటికైన పూర్తి చేసి ప్రయాణీకుల ఇబ్బందులను తొలగించాలన్నారు.**

*పంతులనాయక్, పోచమ్మగడ్డ తాండ.*

## సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడం మోసం చేయడమే...

**- ఎమ్మెల్యేగా గెలిచి తీరుతా... - మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ నేత నాగం జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 06 ప్రభాతవార్త:** నియోజకవర్గానికి చెందిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించేందుకు నిధుల ప్రతిపాదనకు సిద్ధం చేసి ప్రజలను మోసం చేసేందుకు నియోజకవర్గానికి రూ.50కోట్ల 40 లక్షల నిధులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నేత నాగం జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, ఈద్గా మరియు షాది ఖానా నిర్మాణాలకు మూడు కోట్ల 50 లక్షల నిధులు మంజూరైనట్లు ప్రకటించడం మోసం చేయడమే అని అన్నారు. రాబోవు ఎన్నికల్లో అపోహాలను తొలగించి ఎమ్మెల్యేగా గెలిచి తీరుతానన్నారు. ఎమ్మెల్యే ప్రతిపాదనల సర్క్యూలర్ చూపెడుతూ నిధులు మంజూరైనట్లు పేర్కొనడం విడ్డూరంగా ఉందని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు నూతనంగా కళాశాలలు మంజూరు చేసినట్లు ప్రకటించడం తప్ప అక్కడ ఖాళీలు భర్తీచేయడం లేదన్నారు. వెంటనే వైద్యసిబ్బందితో పాటు అధ్యాపక బృందాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో మోసం చేయడం వల్ల సంవత్సరానికి 25వేల నాలుగు వందల కోట్ల వడ్డీ మరియు రుణాలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అక్రమ ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని, న్యాయ స్థానాలు తీర్పు ఇచ్చిన పోలీసుల వ్యవస్థ చేతులు రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, సామాన్యులకు భద్రత కరువైందన్నారు. కృత్రిమ ఇసుక తయారీ నేరమేనని అన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు డాక్టర్ నాగం శశిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, నాయకులు నారాయణగౌడ్, మల్లయ్య, బాలగౌడ్, కోటయ్య, పాండు, నిజాం సుల్తాన్, సత్యం, పర్వతాలు, లక్ష్మయ్య, అహ్మెద్ శ్రీనివాసరావు, బాలరాజు తదితరులు ఉన్నారు.

## ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి



**వనపర్తి టౌన్,జూలై6,ప్రభాతవార్త:** బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను పురస్కరిం చుకుని బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కృష్ణ, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీని యర్ నాయకులు మున్నూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యద ర్శి డి.నారాయణ, జిల్లా ఉపా ధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, కుమార స్వామి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీశైలం, పార్లమెంట్ ఫుల్ టైమర్ బుడ్డన్న, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఎసీనస మోర్చా జిల్లా అధ్యక్షులు కుమార్, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి సూగూరు రాములు, మామిళ్లపల్లి రాయన్న సాగర్, వెంకటేష్ నాయుడు, బొడ్డుపల్లి వెంకటేష్, సామెల్, పద్మక్క, జ్ఞానేశ్వర్, నారాయణ, ఓం ప్రకాష్ చారి, బాబురావు, దేవేందర్, మధుసూదన్ రెడ్డి, విష్ణు జిల్లా ఐటీ కన్వీనర్ విజయ్ కుమార్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుడి విగ్రహ నిర్మాణ పనులను అడ్డుకున్న రజక కులస్తులు

**కొత్తకోట,జూలై6,ప్రభాతవార్త:** పట్టణ సమీపంలో గల అంబ భవానీ ఆలయం ఎదురుగా ప్రభుత్వ స్థలంలో బలిజకులస్తుల ఆరాధ్య దైవం అయిన బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటును స్థానిక రజక కులస్తులు అడ్డుకున్నారు. విగ్రహ నిర్మాణం జరిగితే సమీపంలో గల దోభీ ఘాట్‌కు వెళ్లేందుకు దారి ఇబ్బంది ఉంటుందని, మున్సిపల్ కమిషనర్‌కు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని, తమ సమస్యను పట్టించుకోకుండా విగ్రహ నిర్మాణ పనులు చేస్తున్నారని రజకులు మండిపడ్డారు. విగ్రహ ఏర్పాటు నిర్మాణ పనులు ఆపకపోతే పట్టణంలోని రజకుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం పట్టణ అధ్యక్షులు వెంకటేష్, బాలరాజు, రవి , చంద్రయ్య, లక్ష్మయ్య, నాగరాజు, మన్యం, బాలస్వామి, శ్రీనివాసులు, కుర్మన్న, రవి, ఆంజనేయులు, మహేష్, రామకృష్ణ, తిరుపతయ్య, తిరుపతమ్మ, అంజనమ్మ, శాంతమ్మ, వెంకటమ్మ, లక్ష్మి, సత్యమ్మ, బుచ్చమ్మ తదితరులు ఉన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి చెక్..

**- అధికారులతో కలిసి సమస్య పరిష్కరించిన కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు తాలూకా క్లబ్ మెయిన్ రోడ్డులో మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ లీకేజీకి గురైంది. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి గురువారం ఉదయం లీకేజీని పరిశీలించారు. వెంటనే మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి రోడ్డు ఎక్కువ డ్యామేజీ కాకుండా అత్యాధునిక టెక్నాలజీతో లీకేజీ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ వార్డులో ఎక్కడా పైప్‌లైన్ లీకేజీ ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటికీ శుద్ధజలం అందజేయాలని ఉద్దేశంలో మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టిందని, అధికారులు సిబ్బంది సమన్వయంతో వంద శాతం నల్లా కనెక్షన్ల నీటి సరఫరా చేయాలన్నారు. 24వ వార్డు వేంకటేశ్వర కాలనీ వద్ద లీకేజీ సమస్య ఉన్న కారణంగా రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయని, వాహనదారులు అయోధ్యనగర్ రోడ్ నెంబర్ 3 నుంచి వెళ్లాలని అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

## టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం..

**- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి**

**- బీఆర్ఎస్‌ది అవినీతి పాలన: పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్**

**- టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అంటేనే ఒక కుటుంబం అని బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అనే ఆశయంతో ఎన్‌టీఆర్ టీడీపీ స్థాపించారన్నారు. భారతదేశ చరిత్రలో ఒక గొప్ప పేరు తెచ్చుకున్న రాజకీయ నేత రెండు రూపాయల కిలో బియ్యం ప్రవేశ పెట్టి పేదల ఆకలి తీర్చారని, పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసిన గొప్ప సంస్కరణవాది అని కొనియాడారు. పార్లమెంట్ కమిటీ అనంతరం మండలాలు, గ్రామ, బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకొని వచ్చే ఎన్నికల్లో బలంగా నిలిచేందుకు పార్టీ సైనికులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పార్టీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అధ్యక్షతన బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. బోనాల అనంతరం పల్లె పల్లెకు, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ బస్సు యాత్రకు అడుగడుగునా స్వాగతం పలకాలని కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో తమ సమస్యలను చెప్పుకోవాలని, సమస్యలప పరిష్కారం దిశగా మేనిఫెస్టో తయారు చేస్తామన్నారు. టీడీపీ హయాంలో తీసుకొచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. బీఆర్ఎస్ అవినీతి పాలనను ప్రజలకు వివరిస్తామని, ల్యాండ్, సాండ్ మాఫియాతో కొంత మంది చేతుల్లోనే సంపద ఉందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో అధికారం ఏర్పాటు చేసి టీడీపీ సుభిక్ష పాలన అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## కస్తూర్బా పాఠశాలకు నీళ్ల ట్యాంక్ అందజేత

**ఖిల్లాఘణపురం,జూలై6,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు వాటర్ నిల్వ చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను ప్రిన్సిపాల్ లలిత యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధుకు తెలి యజేయగా వెంటనే స్పందించిన మధు విద్యార్థుల సమస్యకు పరిష్కారం చేయాలని గురువారం వెంకటంపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య, దేవేం దర్,రవి,యువశక్తి ఫౌండేషన్ సహకారంతో 5వేల లీటర్ల వాటర్ ట్యాంకును అందజేశారు.ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల డైరెక్టర్ సుబ్బలక్ష్మి, ప్రిన్సిపాల్ లలిత, గట్టుకాడిపల్లి సర్పంచ్ దేవేందర్ ,రవి, మధు, గణేష్, శివ రామకృష్ణ, రామకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి..

**- నివాళ్లు అర్పించిన పట్టణ కాంగ్రెస్,టీడీపీ నాయకులు**

**వనపర్తి టౌన్,జూలై6,ప్రభాతవార్త:** వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలను పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మాట్లాడుతూ... స్వతంత్ర సమరయోధుడు ప్రముఖ గాంధేయవాది సమతవాది భారత ఉప ప్రధానిగా కేంద్ర రక్షణ రైల్వే కార్మిక రవాణా వ్యవసాయ మంత్రిగా దేశానికి చేశారని, దేశభక్తి శ్వాసగా లక్ష్యంగా స్ఫూర్తించిన దేశంలో సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు కమర్ మియా, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సమద్‌మియా, మైనార్టీ జిల్లా నాయకులు అనిస్, వనపర్తి పట్టణ ఎస్సీ సెల్ మాజీ కౌన్సిలర్ గంధం కృష్ణబాబు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబా కాంగ్రెస్ పార్టీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెంకటేష్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జానకి రాములు, సేవాదళ్ వెంకటేష్ , మండల అధ్యక్షులు సత్యం , భాస్కర్, వనపర్తి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎల్లన్న, నరహరి, గోపాల్‌పేట మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు వేణాచారి, రైతు సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, పెద్దమందడి నాయకులు అంజిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జానంపేట నాగరాజు, అబ్దుల్లా, వెంకటేష్, గంధం లక్ష్మయ్య, ఇంద్ర నాగన్న, ఆల్టా నసీర్, నరేష్ సాగర్, కుర్తి నరేష్, క్రిష్టగిరి వెంకటస్వామి, ద్యారపోగు విజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

**భారత రాజకీయాలలో ఓటమి ఎరుగని ధీరుడు బాబు జగ్జీవన్‌రామ్**

భారత రాజకీయాలలో ఓటమి ఎరుగని ధీరుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షుడు బి.రాములు, వనపర్తి పట్టణ టీడీపీ అధ్యక్షుడు నందిమల్ల అశోక్ లు మాట్లాడుతూ... దళిత బడుగు, బలహీన వర్గాల, గిరిజన, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని, 50 ఏండ్లుగా ఓటమి ఎరుగని పార్లమెంట్ సభ్యులుగా సేవలు అందించారని వారు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా హరితవిప్లవం తెచ్చిన ఘనత బాబు జగ్జీవన్ రామ్ దేనని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి.రాములు, నందిమల్ల అశోక్, రాష్ట్ర ఐటీడీపీ వైస్ ప్రెసిడెంట్ ఎండి గౌస్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నాయకులు కొప్పుల రమేష్, ఎండి జాఫర్, శ్రీపతి రావు, బాలకృష్ణ, రాము, శ్రీరామ్, బాలరాజు, కొత్తగొల్ల శంకర్, అనిల్,మహమ్మద్, వహీద్, గంధం కృష్ణ, శివాజీ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందిని అందరిని పర్మినెంట్ చేయాలి..

**ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా : జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ చారి**

**వీపనగండ్ల,జూలై6,ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జూలై6 నుండి జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి వీపనగండ్ల ఎంపీడీవో కార్యాలయం ముందు సమ్మె సందర్భంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణాచారి మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ సిబ్బందిని అందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులు నియమించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులతో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని ఐదు లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేస్తు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని, వారాంతపు సెలవులు పండుగ సెలవులు, జాతీయ అర్జిత సెలవు దినాలను అమలు చేయాలని, ట్రాక్టర్స్ డ్రైవర్స్‌కు పంచాయతీల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని, గ్రామ పంచాయతీ కార్మికులపై వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో ఆఫీస్ ముందు సమ్మె నిర్వహిస్తున్నామని, కార్మికుల సమస్యలు పరిష్కారం చేయని ఎడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించి పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో వేలాదిగా పాల్గొనాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల నాయకులు ఆశన్న, రామన్ గౌడ్, గ్రామ పంచాయతీ నాయకులు వెంకటయ్య, కృష్ణారెడ్డి, రాజన్ గౌడ్, తిరుపతయ్య, కృష్ణయ్య, నరసింహ, ఈశ్వరమ్మ, గంగమ్మ, రాములమ్మ, సుంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.




ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

## బాక్సి కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన..

**- ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**అచ్చంపేట, జూలై 06 ప్రభాతవార్త:** అచ్చంపేట మండల పరిధి లోని బొమ్మన్‌పల్లి గ్రామ సమీపంలోని సిద్దాపూర్ బొమ్మనపల్లి ప్రధాన రహదారిలో రూ.1.20కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బాక్సి కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వ విఫ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తూ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా మౌళిక సదుపాయాలను కల్పించి గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి పరిచి పల్లెల్లో జీవిస్తున్న ప్రజల జీవన విధానాన్ని మెరుగు పర్చేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడ్కనాయక్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.



కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**మృతుడి కుటుంబానికి పరామర్శ....** వంగూరు మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నూకం తిరుపతయ్య గురువారం ఉదయం పొలంలో పాముకాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకొని అండగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట వంగూరు మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

## మంత్రి కృషితో అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్ వనపర్తి జిల్లా

**- మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్**





వార్డులలో పర్యటించి బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి టౌన్,జూలై6,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితోనే వనపర్తి జిల్లా అభివృద్ధి పథంలో తెలంగాణరాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ అన్నారు. టీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ పరిధిలోని 4, 5వ వార్డులు నర్సింగాయపల్లి తాండలో ఇంటింటి ప్రచారాన్ని పట్టణ అధ్యక్షుడు రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ , వాకిటి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి , పట్టుదలతో జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల అగ్రికల్చర్ రెసిడెన్షియల్ కళాశాలలతో పాటు 30 సం.లుగా జిల్లా వాసులు ఎదురుచూసిన రోడ్డు విస్తరణ పనులను అత్యంత వేగంగా చేపట్టి సుందరంగా రోడ్లను తీర్చిదిద్దుతున్న ఘనత మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికే దక్కుతుందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అరుణ్ ప్రకాష్, జ్యోతి, కౌన్సిలర్లు శాంత రమేష్ నాయక్, బండారు కృష్ణ, షఫీ, ఆరిఫ్, సిరిగిరి మన్యం, శేఖర్ రెడ్డి, రహీం, గులాం ఖాదర్ ఖాన్, నీలస్వామి, సూర్యవంశం గిరి, సునీల్ , బాలరాజు , ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం..

**- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు**

**వనపర్తి టౌన్,జూలై6,ప్రభాతవార్త:** పట్టణంలోని బ్రహ్మంగారి వీధిలో కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు వాలి ఉండడంతో కాలనీవాసులు విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా విద్యుత్ తీగలపై వాలిన కొమ్మలను కట్ చేయాలని కోరినా మాకు సంబంధం లేదు, మాది బాధ్యత కాదు, ఆ పని మున్సిపల్ వారికి సంబంధమని చెబుతు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి సమస్య వివరించినా కూడా మాకు సంబంధం లేదు అని, కరెంటు వారే కొమ్మలు కట్ చేస్తారని ఆయన తెలిపారన్నారు. వర్షాకాలం కావడంతో వర్షాలు ఎక్కువగా వస్తే ఇక్కడ ప్రమాదం జరిగితే దీనికి బాధ్యులు ఎవరు? అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడ ప్రమాదం జరగకుండా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. లేనిపక్షంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.



విద్యుత్ తీగలపై వాలిన చెట్ల కొమ్మలు

## పేదల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట...

**ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**



**అచ్చంపేట,జూలై 06 ప్రభాతవార్త:** పేదల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రభుత్వ విఫ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్మూర్ మండలం గోదల్ గ్రామానికి చెందిన మన్నె రాజుకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల అభ్యున్నతి అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

### భూ తగదాలో మామ మృతి..

**వెల్దండ,జూలై 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో భూ తగదాలో మామ అల్లుడు కొట్లాడుకోగా...మామ ధ్యాప సంజీవరెడ్డి(54) మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... చెర్కూర్ గ్రామానికి చెందిన ధ్యాప సంజీవరెడ్డి అన్నదమ్ములకు కలిగిన 20 ఎకరాల వ్యవసాయ పొలంలో 10 ఎకరాల అక్కచెల్లెలకు కలదు. మేనల్లుడు శేఖర్‌రెడ్డి మామ సంజీవ్‌రెడ్డిలు పొలం విషయంలో గొడవ పడి మాట మాట పెరిగి ఇద్దరు ఘర్షణకు దిగడంతో శేఖర్‌రెడ్డి గట్టిగా నూకడంతో సంజీవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు సంజీవరెడ్డి సోదరుడు లక్ష్మారెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

### మోడల్ పాఠశాలలో నాసిరకం భోజనం అందిస్తున్నారని తహసీల్దార్‌కు వినతి...



**వెల్దండ, జూలై 06 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాసిరకంగా అందిస్తున్నారని ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు మెను ప్రకారం అందించాల్సిన భోజనం నాసిరకంగా అందిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. బీసీ వసతి గృహం శిథిలావస్థలో ఉన్నందున విద్యార్థులకు వసతి గృహ భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చరణ్,శ్రీకాంత్,రాము,గణేష్,నవీన్‌తో పాటు ఉన్నారు.

### ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ కరపత్రం ఆవిష్కరణ



**వనపర్తి టౌన్,జూలై6,ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభను ఈ నెల 8వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుండడంతో ధర్మ సమాజ్ పార్టీ వనపర్తి జిల్లానాయకులు ఎల్లయ్య మహారాజ్,కడుకుంట్ల కురుమన్న, శ్రీనివాసులు,రామకృష్ణలు కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడిజిల్లా నుండి బీసీ,ఎస్సీ,ఎస్టీ ప్రజలు అధికశాతం హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమానికి సుమారుగా 2వేల ద్విచక్రవాహనాలలో జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి సభ ప్రాంగణానికి చేరుకుని కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వారు తెలిపారు.

### సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి

**వెల్దండ, జూలై 06 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల సాధనకై చేపట్టిన నిరవధిక సమ్మె చేపట్టడంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తుందని సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్లు, గ్రామాల పరిశుభ్రతతో పాటు మరిన్ని పనులు ఎక్కడికక్కడ లోపించి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, అధికారులు వెంటనే స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.



# సమ సమాజ స్థాపన కోసం ఎనలేని కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం

**- కోండేరులో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మందా జగన్నాథం**



బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఇటిక్యాల, జూలై 06 ప్రభాతవార్త:** భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం సమాజంలో అనగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసిన సంఘసంస్కర్త స్వాతంత్ర్య సమర యోధుడు భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రామ్ అని ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. గురువారం మండల పరిధిలోని కోండేరు గ్రామంలో భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మందా జగన్నాథం, అలంపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి మందా శ్రీనాథ్, జెడ్పీటీసీ హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వడ్డెపల్లి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్‌మాజీ చైర్మన్ రాందేవ్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పెద్దఎత్తున హజరైఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మందా జగన్నాథం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత దేశ తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం చేసిన సేవలు సమసమాజ స్థాపన, అనగారిన వర్గాలసంక్షేమం కోసంకృషి చేశారని, దేశంల ఆయన ఎన్నో వివిధ రకాల మంత్రి పదవులు చేపట్టారని, కార్మిక శాఖగా మంత్రిగా ఉన్న సమయంలో సామాజిక న్యాయం కోసం ఎంతో కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మందా జగన్నాథం

చేయడం జరిగిందని ఆయన సేవలను కొనియాడారు. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం బుధవారం జోగులాంబ గద్వాల్ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేయడంతో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, ఐటీ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ ఈరన్న, నాయకులు నారాయణనాయుడు, చంద్రహాస్‌రెడ్డి, అంజి, రాంరెడ్డి, చంద్రగౌడ్, బొట్టు వీరన్న, రఘురాములు తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

**- ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షులు ప్రసాద్**



సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

**కొత్తకోట, జూలై6, ప్రభాతవార్త:** ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయతీ కార్మికులు చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్నారని, పనికి తగట్లు వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షులు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రసాద్, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు నిక్సన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొత్తకోట మండల పరిషత్ ఆవరణంలో పంచాయతీ కార్మికులతో కలిసి వేతనాలు పెంచాలంటూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రత్యేక రాష్ట్రంలో పంచాయతీ కార్మికులకు న్యాయం జరుగుతుందని అనుకున్నామని, కేసీఆర్ పాలనలో కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. గత ఐదేళ్ల కిందట 43 రోజుల పాటు సమ్మె చేస్తే రూ.8500 సాధించుకోవడం జరిగిందని, నాటి నుండి నేటి వరకు కార్మికుల గురించి పట్టించుకోవడం లేదని, ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు పెరిగాయని కార్మికులకుఇచ్చే వేతనాలతో కుటుంబాలు గడవడం లేదన్నారు. పంచాయతీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు 11వ పీఆర్‌సీ నిర్ణయించిన ప్రకారం బేసిక్ వేతనం రూ.19వేలు ఇవ్వాలని, అదే విధంగా జీవో నంబర్ 51 సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా వర్తింపజేయాలని, ప్రమాదం జరిగి మరణిస్తే కార్మికుడికి రూ.10 లక్షల నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు బొజ్జన్న, కరీం, శ్రీను, రమేష్, అశోక్, వెంకటన్న, దేవన్న, బాలరాజు, రమేష్, వెంకటేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## వర్నెవాగు బ్రిడ్జి రోడ్డు స్థల సేకరణకు స్థానిక రైతులతో చర్చించిన మండల జడ్పీటీసీ



వర్నె గ్రామస్తులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి

**అడ్డాకుల, జూలై6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వర్నె ముత్యాలంపల్లి తదితర గ్రామాలకు వర్నె వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. బ్రిడ్జి రోడ్డు భూ సేకరణ కొరకు స్థానిక రైతులతో జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి చర్చించారు. ఈ నిర్మాణం పూర్తయితే చుట్టు పక్కల గ్రామాల చిరకాల వాంఛ నెరవేరుతుందని, రవాణా సౌకర్యానికి ఆటంకాలు తొలగిపోతాయని అభివృద్ధికి సహకరించాలని, వాగు బ్రిడ్జి రోడ్డు కు సరిహద్దుకు ఆందోళన చెందుతున్న రైతులతో జడ్పీటీసీ చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కిషన్ నాయక్, మండల కో ఆప్షన్ ఖాజా ఘోరి, వర్నె గ్రామ సర్పంచ్ బంగారయ్య, ముత్యాలంపల్లి గ్రామ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, వర్నె ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి అనిత, వర్నె గ్రామ మాజీ సర్పంచ్ కొండన్న యాదవ్, వర్నె గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలస్వామి, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, విజయ్‌శెట్టి, రైతులు సహదేవ్, ఉప్పరిశ్రీను, యువకులు సురేష్, ప్రకాష్, కృష్ణ, అడ్డాకుల మండల యువ నాయకులు బొడ్డు రమేష్, ఏలుసరి బాలరాజు, మహేష్ యాదవ్, వర్నె గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం

**-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

**వెల్దండ, జూలై06 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పోచమ్మగడ్డ తాండకు చెందిన మౌనిక 20 అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామనికాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి భరోసానిచ్చారు. ఆయన తరుపున ఫౌండేషన్ సభ్యులుబాధిత కుటుంబాన్ని పరామర్శించి చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహయాన్ని అందించారు. ఏ మాత్రం అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పంతులనాయక్, లక్ష్మణ్, జయరాంనాయక్, రాజు, మున్న, సందీప్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్‌ల పంపిణీ

**పెబ్బేరు, జూలై6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామం ప్రాథమిక పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థికి రెండు జతల ఉచిత యూనిఫామ్స్‌లు పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ నక్కల పద్మమ్మ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఉచితంగా దుస్తులను పంపిణీ చేస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## అవార్డులు ప్రభుత్వానికి..

# ఆత్మహత్యలు సర్పంచులకా..?

- ◆ 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పులపాలైన సర్పంచులు, ఎంపీటీసీలు
- ◆ ఈ ఎన్నికల్లో కలిసికట్టుగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తెద్దాం
- ◆ టీఎంఆర్ యువసేన నాయకులు ఐ.సత్యారెడ్డి
- ◆ చిలకటోనిపల్లి, మోజర్ల, మద్దిగట్లలో పర్యటించిన నాయకులు



మోజర్ల మాజీ సర్పంచ్ నాగరాజును కలిసిన టీఎంఆర్ యువసేన నాయకులు

**పెద్దమందడి, జూలై6, ప్రభాతవార్త:** 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు వస్తే అప్పులు చేసి గ్రామానికి అభివృద్ధి పథంలో నడిపించిన సర్పంచులకు ఆత్మహత్యలే మిగిలాయని టీఎంఆర్ యువసేన ముఖ్య నాయకులు పెద్దమందడి మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు ఐ.సత్యారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయకపోగా సర్పంచ్‌లుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సొంత డబ్బులు ఖర్చు చేసి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామాలు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, హరితహారం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగిందని, చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోరాష్ట్రంలో ఇప్పటికే కొన్ని చోట్ల సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవడంతో పాటు మరికొన్ని గ్రామాల్లో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం టీఎంఆర్ యువసేన మండల నాయకులు చిలకటోనిపల్లి, మోజర్ల, మద్దిగట్ల గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాలలో ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను కలిసిన టీఎంఆర్ యువసేన నాయకులు కలిసికట్టుగా ఈసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాలలో పర్యటించిన నాయకులకు ప్రజలు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామాలలో రాజకీయాలు చిన్నాభిన్నంఅయ్యాయని ఒకరితో ఒకరు మాటాడుకోలేని పరిస్థితులు ఉన్నాయని, గ్రూపులు, వర్గాలతో పల్లెలు అతలాకుతలం అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిలకటోనిపల్లి, మోజర్ల, మద్దిగట్ల గ్రామాల్లోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలను కలిసిఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే అన్ని వర్గాల పేదలకు సమన్యాయం జరుగుతుందని ఆసరా పింఛన్లు రూ.4వేలకు పెంచుతామని, సిలిండర్ ధర రూ.500 కే అందించడంతో పాటు ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలోమోజర్ల మాజీ సర్పంచ్ నాగరాజు, వైస్ ఎంపీపీ రఘు ప్రసాద్, చిలకటోనిపల్లి సర్పంచ్ పద్మ కృష్ణ, వెల్టూరు సర్పంచ్ ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ బాలయ్య, మద్దిగట్ల మాజీ సర్పంచ్ చెన్నకేశవులు, పుట్టమోని నారాయణ, గట్లఖానాపురం మాజీ సర్పంచ్ చింతకాయల వెంకటేష్, మద్దిగట్ల మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్యగౌడ్, గట్లఖానాపురం మాజీఎంపీటీసీ దామోదర్, మాజీ ఉప సర్పంచ్‌లు శివరాజు, కృష్ణారెడ్డి, శంకర్ రెడ్డి, రఘుమా రెడ్డి, వార్డు సభ్యులు శివారెడ్డి, టీఎంఆర్ నాయకులు డీలర్ శ్రీనివాసులు, కురుమూర్తి, వెంకటేష్, రామకృష్ణారెడ్డి, భగవంత్, ఆంజనేయులు, పుల్లయ్య, సంకలమద్ది వెంకటయ్య, గండు వెంకటేష్, కోదండ రామయ్య, బాలస్వామి, విక్రమ్‌రెడ్డి, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నిరసన

**కల్వకుర్తి, జూలై 06 ప్రభాతవార్త:** రైతుల ఖాతాలను హోల్డ్‌లో నుంచి తీసేయాలని, ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఉదయం నుంచే యూత్ కాంగ్రెస్ నాయకులను తమ ఇండ్ల వద్దనే అరెస్ట్‌లు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఉదయం నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం దగ్గర భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చాలా మంది యూత్ కాంగ్రెస్ నాయకులు క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన తెలియజేస్తూ నినాదాలు చేపట్టారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు అనిల్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖునీ అయ్యిందని, ప్రజాస్వామ్య దేశంలో కనీసం నిరసన తెలిపే హక్కు లేకుండా నియంతృత్వ కేసీఆర్ పాలన కొనసాగుతుందని విమర్శించారు. రైతుబంధు పేరుతో ప్రభుత్వం ఓ వైపు పంట పెట్టుబడుల కోసమన రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తూనే, మరో వైపు బ్యాంకులు రుణాలు చెల్లించాలనే కారణంతో వారి ఖాతాలను హోల్డ్‌లో ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజల తరుపున బ్యాంక్ అధికారులతో మాట్లాడాల్సిన ఎమ్మెల్యే స్పందించకపోవడం దారుణమన్నారు. కనీసం ఇప్పటికైన ఎమ్మెల్యే స్పందించిరైతుల ఖాతాలను హోల్డ్‌లో




యూత్ కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నుంచి తీసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అరెస్ట్ చేసినయూత్ కాంగ్రెస్ నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బాలరాజు, రమేష్‌నాయక్, జంగయ్యగౌడ్, సుదర్శన్, రమేష్, శ్రీపతి రాజు, ఆంజనేయులు, రాహుల్, కృష్ణ, సతీష్, రాజు, నర్సింగ్, మహేష్, శ్రీను, సంతోష్, వినయ్, మహేష్, కృష్ణయ్య, కొండల్ తదితరులు ఉన్నారు.

## వనపర్తి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఘన సన్మానం

**వనపర్తి క్రైమ్, జూలై6, ప్రభాతవార్త:** మదనాపురం పోలీస్ స్టేషన్ యొక్క అత్యాచార, ఫోక్సో కేసులో నేరస్తుడైన మచ్చన్ షేక్ తండ్రి తచ్చన్ షేక్ (48) గ్రామం హల్సంపర, మండలం ముర్షిదాబాద్ జిల్లా 20 సంవత్సరాల ఆరునెలల కఠిన కారాగార శిక్ష, రూ.2వేలు జరిమాన విధించిన కేసులో వనపర్తి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ రావును , కేసు పరిశోధన చేసిన వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డిని, కోర్టు కానిస్టేబుల్ సిబ్బందికి జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి గురువారం సన్మానించారు. 20.04.2022 న ఫిర్యాదురాలు కుమార్తెపై నేరస్థుడు చుట్టుపక్కల ఎవ రు లేనిది గమనించి పాపను ఒక పాడుబడిన గదిలోకి తీసుకుని వెళ్లి శారీ రకంగా హింసించి పాపతో అసభ్యంగా ప్రవర్తించి నానా ఇబ్బందులకుగురి చేశాడని ఫిర్యాదురాలు దరఖాస్తు ఇవ్వగా అప్పటి ఎస్ఐ మంజునాథ్ రెడ్డి కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారని, వనపర్తి డీఎస్పీ ఆనం ద్‌రెడ్డి కేసు తదుపరి పరిశోధన పూర్తి చేసి పైనేరస్థుని అరెస్టు చేసి జ్యుడిషియల్ డిమాండ్‌కు పంపించడం జరిగిందని, తదుపరి పరిశోధన పూర్తి చేసి కోర్టులో ఛార్జీషీట్ దాఖలు చేశారని , ఆ రోజు నుండి ఈ రోజు వరకు కేసు విచారణ జరిగిందని, ప్రిన్సిపల్ డిస్టిక్, సెషన్స్ జడ్జీ సునిత ఇరువురి వాదనలు విన్న తరువాత, నేరస్థునిపై నేరం ఋజువైనందున 20 సం.ల 6నెలల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. నేరస్థునికి జైలు శిక్ష పడడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.చంద్రశేఖర్ రావు, తన వాదనలు వినిపించారు. కానిస్టేబుళ్లు మన్యంకొండ, కోర్టు లైసెన్ ఆఫీసర్, హెడ్ కానిస్టేబుల్‌సత్యం సహకరించారు. ఈసందర్భంగా వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి, కేసు ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీసు అధికారులను ప్రాసిక్యూషన్ సమయంలో సపోర్టు చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బందిని అభినందించి శాలువాతో సత్కరించారు.




సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి

## పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

**- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ కారోబార్ బిల్ కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలులోకి వచ్చాక కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. మల్టీపర్పస్ అనే విధానంలో అన్ని రకాల పనులు అందరూ చేయాలంటూ ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తుందని, ప్రభుత్వం ఇష్టానుసారంగా సర్పంచులను, సెక్రెటరీలను తొలగిస్తుందన్నారు. పీఆర్‌సీ ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీల్లో కనీస వేతనం రూ.15600 అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## అంగన్వాడీ కేంద్రాలకు సామాగ్రి అందజేత



అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

**కొత్తకోట, జూలై6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అమడబాకుల గ్రామంలోని మూడు అంగన్వాడీ కేంద్రాలకు సర్పంచ్ బుచ్చన్న సొంత ఖర్చులతో కుర్చీలతో పాటు చిన్నారులు కూర్చోవడానికి సాపలు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, టీచర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈకార్యక్రమంలో బిజె కృష్ణ, సైదయ్య, తిరుపతయ్య, సురేంద్రచారి, గొల్ల శ్రీను, నాగేంద్రం, అంగన్వాడీ టీచర్స్ రాధ, జయలక్ష్మి, సునిత తదితరులు ఉన్నారు.

## అధికారుల సూచనల మేరకే ఎరువులు, విత్తనాలు కొనాలి



ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలను పరిశీలిస్తున్న ఏఈవో రవీందర్‌రెడ్డి

**కొత్తకోట, జూలై6, ప్రభాతవార్త:** రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను వ్యవసాయ అధికారుల సూచనల మేరకే కొనుగోలు చేయా లని వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్ రెడ్డి అన్నారు. ఉన్నతాధి కారుల ఆదేశానుసారం గురువారం మండల పరిధిలోని అమడబాకుల క్లస్టర్ పరిధిలో గల ఫర్టిలైజర్ షాపులను ఏఈవో తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయా ఫర్టిలైజర్ షాపుల్లో గల విత్తనాలను, ఎరువులను కుణ్ణంగా తనిఖీ చేశారు. నకిలీ ఎరువులు విక్రయించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు పంటలసాగు, ఎరువుల వాడకం వంటి వాటిపై వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**అడ్డాకుల, జూలై6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి స్పెషల్ జ్యుడీషియల్ న్యాయమూర్తి నిర్మల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. అడ్డాకుల గ్రామానికి చెందిన కుమ్మరి కొండన్న తండ్రి చిన్న పెంటన్న అనే వ్యక్తి జూలై 1వ తేదీన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అధికంగా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కాడు. గురువారం స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి కుమ్మరి కొండన్న రెండు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## సీఈఐఆర్ పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్ రికవరీ



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్న ఎస్ఐ

**అడ్డాకుల, జూలై6, ప్రభాతవార్త:** అడ్డాకుల మండల కేంద్రంలోని కందూరు గ్రామానికి చెందిన కొండన్న, రాచాల గ్రామానికి చెందిన షాహిల్, కందూరు గ్రామానికి చెందిన మల్లికార్జున్ సెల్ ఫోన్లు అడ్డాకుల మండల కేంద్రంలో పోగొట్టుకున్నామని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ నందు నమోదు చేసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాప్ చేసి సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

## ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై06 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఏక్ దేశ్ మే దో విధాన్... దో ప్రధాన్ ఔర్ దోనిషాన్ నహీ చలేగా నహీ చలేగా అని నినాదించి అఖండ భారతవని కోసం ప్రాణాలర్పించారని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుసిరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని బీజేపీపార్టీ కార్యాలయంలోఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేష్, లోహిత్‌రెడ్డి, మల్లేష్, ఆంజనేయులు, ఆంజనేయులు, ఇంద్రసేనరెడ్డి, శేఖర్, కృష్ణ, నాయకులు సుధాకర్, శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, సత్యం, రాజు తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ బస్సు క్రింద పడి యాచకురాలు మృతి



బస్సు ప్రమాదంలో మృతి చెందిన యాచకురాలు హుస్సేన్‌బి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 06 ప్రభాతవార్త:** ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా యాచకురాలు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో గురువారం మధ్యాహ్నం చోటు చేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని వనపట్ల గ్రామానికి చెందిన హుస్సేన్‌బి (55) రోజు వారి మాదిరిగానే భిక్షాటన చేస్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్టాండ్ లోపలికి మల్లుతున్న క్రమంలో డ్రైవర్ యాచకురాలిని గమనించకపోవడంతో ఆమె మెడపై నుంచి బస్సు పోవడంతో అక్కడికక్కడే మృతి చెందినది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

## బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

**- జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై6, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్‌కు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడని, తొలిదళిత ఉపప్రధానిగా దేశానికిఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన మార్గం ఆచరనీయమని, ఆధునికి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ ఫ్రంట్ జిల్ల అధ్యక్షుడు మహ్మద్ హాఫీజ్ ఉర్‌రహెమాన్, కౌన్సిలర్ లత, ఏఎంసీ డైరెక్టర్ మచ్చుల శ్రీను, దర్శన్, పరమటయ్య, గోనెల రాధాకృష్ణ, టైగర్ జంగయ్య పాల్గొన్నారు.



## వసతి గృహం నుండి పాఠశాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం



వసతిగృహం నుండి పాఠశాలకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

**వనపర్తి టౌన్, జూలై6, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణం నాగవరం శివారులోని బాలికల ఎస్టీ వసతి గృహం నుండి అంబేద్కర్ చౌరస్తాలోని బాలికల ఉన్నత పాఠశాలకు ఏర్పాటు చేసిన బస్సును ఎస్పీ రక్షిత కె.మూర్తి గురువారం ప్రారంభించారు. పట్టణంలో ఉన్న బాలికల వసతి గృహాన్ని నాగవరం శివారులోని కొత్త భవనంలోకి మార్చడంతో విద్యార్థినిలు వసతిగృహం నుండి పాఠశాలకు వెళ్లేందుకు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం అవుతుంది. వసతిగృహం నుండి పాఠశాలకు వెళ్లాలన్న,పాఠశాల నుండి వసతిగృహంకు వెళ్లాలన్నా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సునుఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరి తెలిపారు.ఆర్టీసీ బస్సుఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డినిరంజన్‌రెడ్డికి బాలికలఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాభాయి, పాఠశాల బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

**పెబ్బేరు, జూలై6, ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం బున్యాధిపురంకు ప్రభుత్వం రూ.1.33 కోట్లు మంజూరు చేసినట్లు సర్పంచ్ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ వనం రాములు చెప్పారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ...ఏడాది కిందట సీఎం కేసీఆర్ గద్వాల పర్యటన నిమిత్తం రంగాపురంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి నిధులు ఇవ్వాలని సీఎంను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కోరగా నిధుల మంజూరుకు అప్పట్లోనే ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు, మంజూరుకు కృషి చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డికి గ్రామస్తుల తరపునసర్పంచ్ గోవిందమ్మ కృతజ్ఞతలుతెలిపారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ రాములు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలకు నీళ్ల ట్యాంక్ అందజేత



వాటర్ ట్యాంక్ అందజేస్తున్న యువశక్తి ఫౌండేషన్ సభ్యులు

**ఖిల్లాఘణపురం, జూలై6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు వాటర్ నిల్వ చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను ప్రిన్సిపాల్ లలిత యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధుకు తెలియజేయగా వెంటనే స్పందించిన మధు విద్యార్థుల సమస్యకు పరిష్కారం చేయాలని గురువారం వెంకటంపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య, దేవేందర్,రవి,యువశక్తి ఫౌండేషన్ సహకారంతో 5వేల లీటర్ల వాటర్ ట్యాంకును అందజేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల డైరెక్టర్ సుబ్బలక్ష్మి, ప్రిన్సిపాల్ లలిత, గట్టుకాడిపల్లి సర్పంచ్ దేవేందర్ ,రవి, మధు, గణేష్, శివ రామకృష్ణ, రామకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్

**పెబ్బేరు, జూలై6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామం ప్రాథమిక పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థికి రెండు జతల ఉచిత యూనిఫామ్స్‌లు పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ నక్కల పద్మమ్మ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఉచితంగా దుస్తులను పంపిణీ చేస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



**మక్తల్,ప్రభాతవార్త, జూలై 6, ప్రభాతవార్త:** భారత దేశ ఉప ప్రధానిగా చేసి యావత్ భారత జాతిని చైతన్యపర్చిన గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవ న్‌రామ్ అని కొనియాడారు. అంబేద్కర్ యువజన సంఘం, బాబు జగ్జీవ న్‌రామ్ సంఘం ఆధ్వర్యంలో మక్తల్‌లో ఆయన విగ్రహం వద్ద నివాళుల ర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి, సంంఘాల అధ్యక్షులు జుట్ల శంకర్, నర్సింహులు, నాయకులుచిన్న హనుమంతు, రాములు, ఆనంద్, దినేశ్, బాలప్ప, కేశవులు,రమేశ్ పాల్గొన్నారు.

**జడ్చర్లలో:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోబాబు జగ్జీవన్‌రామ్‌కు వివిధ పార్టీలనాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన నివాళి అర్పిం చారు. మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధు డని,తొలిదళిత ఉపప్రధానిగా దేశానికిఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన మార్గం ఆచరనీయమని, ఆధునికి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునా దులు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ ఫ్రంట్ జిల్ల అధ్యక్షుడు మహ్మద్ హాఫీజ్ ఉర్రహెమాన్, కౌన్సిలర్ లత, ఏఎంసీ డైరెక్టర్ మచ్చల శ్రీను, దర్శన్, పరమటయ్య, గోనెల రాధాకృష్ణ, టైగర్ జంగయ్య పాల్గొన్నారు.

# ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలి




## అటెండెన్స్ వేసి ఇంటికి వెళ్తున్నారు : నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, జూలై 6, ప్రభాతవార్త:** సూపర్ వైజర్ యాప్‌లో అంగన్‌వాడీలు వందశాతం అటెండెన్స్ వేస్తున్నారని కానీ అటెండెన్స్ వేసి ఇండ్లకు వెళ్తున్నారని, ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని పని తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈమేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కేంద్రాల్లో టీచర్లు సమయ పాలన పాటిస్తున్నారా లేదా, పిల్లల శారీరక మానసిక ఎదుగుదలను కార్డులో నమోదు చేస్తున్నారా లేదా పర్యవేక్షించాలన్నారు. సూపర్‌వైజర్ యాప్‌లోటీచర్ల అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. ఎనిమియాను గుర్తించి పిల్లలకు మాత్రలను అందించాలని, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ముస్కాన్, స్మైల్‌లో ఇప్పటివరకు ఎన్ని కేసులు చేయడం జరిగిందని వివరాలు తెలుసుకున్నారు. చిల్డ్రన్ హోమ్‌లో ఉన్న విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో శిశు సంక్షేమ అధికారి వేణుగోపాల్, సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

# రెండో విడత దళితబంధుకు గ్రీన్ సిగ్నల్

- రాష్ట్ర వ్యాప్తంగా 1.30లక్షల మందికి మంజూరు గ్రీన్ సిగ్నల్
- నియోజకవర్గానికి 1100 మంది..
- నాడు కూలీలు..నేడు యజమానులు
- దళితబంధుతో మారిక స్థితిగతులు
- సొంతూళ్లలోనే దర్జాగా జీవనం..






దళితబంధు కింద మంజూరైన సెంట్రింగ్ యూనిట్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూలై 6, ప్రభాతవార్త:** దళిత బంధు రెండో విడతకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా నియోజక వర్గానికి 1100 మందికి ఈ పథకం కింద రూ.10లక్షలు అందజేయనున్నారు. ఈ మేరకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రెండో విడతలో 1.30 కుటుంబాలకు ఆర్థికసాయం అందిచనున్నారు. దళితులు స్థితిగతులను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధు పథకం ఎంతో మంది ఆర్థిక పరిస్థితిని మార్చివేసి వారి సొంత కాళ్ల మీద నిడబడేలా చేసింది. కూలీలుగా పని చేసే ఎంతో మంది దళిత కుటుంబాలు నేడు యజమానులుగా ఇతరులకు పని కల్పించే స్థాయికి ఎదిగారంటే అది దళితబంధు పుణ్యమే. అలాంటిదే హన్వాడ మండలానికి చెందిన లింగగాల ఎల్లమ్మ, వెంకటయ్య దంపతుల కథ. సర్కార్ వల్లే తాము సగర్వంగా బతుకుతున్నామంటున్న వారి జీవన మార్పుపై ప్రత్యేక కథనం.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం అమ్మపూర్ తండాకు చెందిన నిరుపేద దళితులు ఎల్లమ్మ, వెంకటయ్య. గ్రామంలో చిన్న ఇంట్లో నివసిస్తున్నారు. వెంకటయ్య మేస్త్రీ పని చేస్తూ చాలీచాలని కూలితో జీవితం గడిపేవాడు. అయితే కుటుంబ పోషణ, ఆర్థిక పరిస్థితి వల్ల వెంకటయ్య దుబాయ్ వెళ్లి అక్కడ నాలుగేండ్లు కూలీగా చేశాడు. అక్కడ పని చేస్తున్న క్రమంలో కంటికి గాయం కావడంతో తిరిగి అమ్మాపూర్‌కు వచ్చేశాడు. తనకు వచ్చిన మేస్త్రీ పని చేస్తూ రోజుకు రూ.500 సంపాదించేవాడు. సంపాదన సరిపోక హైదరాబాద్‌లో భార్యభర్తలు పని చేసేవారు. రోజుకు వెయ్యి రూపాయలు సంపాదించిన తినడానికి ఊరికి వచ్చి వెళ్లడానికి వచ్చి వెళ్లేందుకు, పిల్లల చదువుల ఖర్చుకు సరిపోయేది. అదే సమయంలో ఎల్లమ్మ తండ్రి అనారోగ్యంతో మంచంపట్టాడు. కాగా అతడిని చూసే దిక్కు లేకపోవడంతో ఆ బాధ్యత కూడాఎల్లమ్మపై పడింది. పిల్లలను చదివించు కోవడంతోపాటు ఎల్లమ్మ తండ్రికి మంచి వైద్యం చేయించాలని ఉన్నా చేతిలో డబ్బులు లేక సొంతూరుకు రాలేక నిస్సహాయ స్థితిలో ఉన్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధు వారి కుటుంబానికి వరంలా మారింది. వెంకటయ్య మేస్త్రీ పని చేసేవాడు కాబట్టి భవన నిర్మాణానికి సంబంధించిన యూనిట్ తీసుకుంటే బాగుంటుదని అధికారులు తెలుపడంతో ఎల్లమ్మ పేరుపై యూనిట్ మంజూరు అయ్యింది. దానికి తిరుమల సెంట్రింగ్ యూనిట్ అని పేరు పెట్టారు. ఈ యూనిట్ కింద రూ.10లక్షలు మంజూరు కాగాలక్ష రూపాయల వ్యయంతో ఉన్న ఇంటి ముందే చిన్న షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. మేస్త్రీ కావడం వల్ల షెడ్డు నిర్మాణం కూడా సొంతంగా చేసుకున్నారు. తక్కిన మొత్తంతో సెంట్రింగ్‌కు సంబంధించిన సామాన్లు మొత్తం హైదరాబాద్ నుంచి కొనుగోలు చేశారు. ఒకేసారి రెండు మూడు ఇండ్లకు సరిపడా మెటీరియల్ కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. చుట్టపక్కలఇలాంటి సెంట్రింగ్ యూనిట్ ఎక్కడా లేకపోవడంతో గిరాకీబాగా పెరిగింది. సామాన్లు కిరాయికి ఇవ్వడమే కాకుండా గిరాకీ లేనప్పుడుభార్యాభర్తలు కూలీపనులకు కూడా వెళ్తున్నారు.

### మా సెంట్రింగ్ యూనిట్ బాగా నడుస్తున్నది..



కిష్టంపల్లి, మునిమోక్షం, గోవింద తదితర గ్రామాలకు సెంట్రింగ్ మెటీరియల్ ఇస్తున్నాము. నెలకు రూ.30వేలకు పైగానే మిగులుతున్నాయి. ఈ పథకం బాగుంది. నాలాంటి వాళ్లకు వరంలాం టిది. బతకడానికి దుబాయ్ వెళ్లిన తాము, తిరిగి సొంతూళ్లలోనే పని చేసుకోవడం అందరి మధ్యనే ఉండడం ఆనందంగా ఉన్నది.

- దంపతులు ఎల్లమ్మ, వెంకటయ్య, అమ్మాపూర్

### అట్టడుగు దళితులకు ప్రోత్సాహం..



ఆయా రంగాల్లో అనుభవం ఉన్న వారికి దళిత బంధు యూనిట్లు ఇస్తే బాగా ఉపయోగపడుతుంది. లబ్ధిదారులను గుర్తించి యూనిట్లు కేటాయిస్తే విజయవంతంగా నడుస్తుంది. ఇతరుల పని చేయలేక, వచ్చేజీతం,కూలి సరిపోక ఇబ్బందులు పడేవారికి ఉన్న ఊరి లోనే సొంతంగా పని చేస్తే తృప్తి కలగడమే కాక ఇతరపనులు కూడా చేసుకుంటారు. అట్టడుగున ఉన్న దళితులకు ప్రోత్సహిస్తే ఈపథకం అద్భుతంగా నడుస్తుంది..

- శంకర్, సర్పంచ్,అమ్మాపూర్ తండా

### గర్వంగా బతుకుతున్నారు..



అమ్మాపూర్ తండాలో రెండు దళిత కుటుంబాలు ఉన్నాయి. వారిద్దరికి దళితబంధు పథకం కింద ఒకరికి ట్రాక్టర్, మరో కుటుంబానికి సెంట్రింగ్ యూనిట్ ఇచ్చాము. ఈ రెండు యూనిట్లు చాలా బాగా నడుస్తున్నాయి. మండలంలో 35మంది లబ్ధిదారులకు 31 దళితబంధు యూనిట్లు ఇచ్చాము. ఇందులో ట్రాక్టర్ ట్రాలీలు 12,ఒక జేసీబీ, 13 మినీ డెయిరీ, 2సెంట్రింగ్,2 పౌల్ట్రీ ఫామ్,ఒక సిమెంట్,స్టీల్ షాప్ పెట్టించాం. ఇవన్నీ లబ్ధిదారులు బాగా నడిపించుకుంటున్నారు. 35 కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగవడం మూలంగావారి పిల్లలకు మంది విద్యను అందిస్తున్నారు. గ్రామాల్లో గర్వంగా బతుకుతున్నారు.

- ధనుంజయ గౌడ్, ఎంపీడీవో,హన్వాడ

## 17 మంది ఎస్సైల బదిలీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో 17 మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వుల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాలో 17 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసినట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ తెలిపారు.

| ఎస్సై పేరు | ప్రస్తుతం పని చేస్తున్న ప్రదేశం | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|---|
| ఎన్ రామకృష్ణ | వన్‌టౌన్, మహబూబ్‌నగర్ | సీసీఎస్ మహబూబ్‌నగర్ |
| జి బాలకృష్ణ గౌడ్ | వన్‌టౌన్ మహబూబ్‌నగర్ | సీసీఎస్ మహబూబ్‌నగర్ |
| ఏ విజయ్‌కుమార్ | వీఆర్ మహబూబ్‌నగర్ | ఎస్సై 2,రూరల్ పీఎస్‌మహబూబ్‌నగర్ |
| కే గోఖరి | వీఆర్ మహబూబ్‌నగర్ | సీసీఎస్ మహబూబ్‌నగర్ |
| ఎస్ఎం నవీద్ | వీఆర్ మహబూబ్‌నగర్ | ఎస్సై 1,వన్‌టౌన్, మహబూబ్‌నగర్ |
| ఎం సుధామాధురి | వీఆర్ మహబూబ్‌నగర్ | ఎస్సై 2,వన్‌టౌన్ పీఎస్,మహబూబ్‌నగర్ |
| అల్లె నాగరాజన్ | వీఆర్ మహబూబ్‌నగర్ | ఎస్సై 1,టూటౌన్, మహబూబ్‌నగర్ |
| కే సుజాత | వీఆర్ మహబూబ్‌నగర్ | ఎస్సై 2, టూటౌన్, మహబూబ్‌నగర్ |
| చంద్రమోహర్‌రావు | వీఆర్ మహబూబ్‌నగర్ | అటాచ్‌డ్ టు జడ్చర్ల పీఎస్ |
| పీ శ్రీనివాసులు | వీఆర్ మహబూబ్‌నగర్ | సీసీఎస్ మహబూబ్‌నగర్ |
| జీ రాఘవేందర్ | వీఆర్ మహబూబ్‌నగర్ | ఎస్సై 2, మహ్మదాబాద్, ఐటీ సెల్ |
| ఎం స్వాతి | డీఎస్బీ మహబూబ్‌నగర్ | ఉమెన్ పీఎస్ మహబూబ్‌నగర్ |
| ఎండీ అఫ్జల్ | డీఎస్బీ మహబూబ్‌నగర్ | ఉమెన్ పీఎస్ మహబూబ్‌నగర్ |
| ఎస్ బాల్‌రెడ్డి | ఉమెన్ పీఎస్ మహబూబ్‌నగర్ | పీసీఆర్ మహబూబ్‌నగర్ |
| డీ సుజాత | ఉమెన్ పీఎస్, మహబూబ్‌నగర్ | వీఆర్ మహబూబ్‌నగర్ |
| సీహెచ్ శ్రీకాంత్ | టూటౌన్ పీఎస్,మహబూబ్నగర్ | డీఎస్బీ మహబూబ్‌నగర్ |
| జి భాస్కర్ రెడ్డి | భూత్పూర్ పీఎస్ | డీఎస్బీ మహబూబ్‌నగర్ |

## 9 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు

- ఉత్తర్వులు జారీ చేసిన జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 9మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతలు కల్పించారు. పదోన్నతులతోపాటు స్థానచనలం కూడా కల్పించడం జరిగింది. ఈ మేరకు వారిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వుల జారీ చేశారు.

| పేరు | ప్రస్తుతం పని చేస్తున్న ప్రదేశం | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|---|
| డీ వేమన్న | నాగర్‌కర్నూల్ | వనపర్తి |
| సీ ఇందిరమ్మ | నాగర్‌కర్నూల్ | వనపర్తి |
| ఎండీ నయీం | మహబూబ్‌నగర్ | నాగర్‌కర్నూల్ |
| సీ శివయ్య | మహబూబ్‌నగర్ | నాగర్‌కర్నూల్ |
| ఎం రాంచందర్ జీ | గద్వాల | నాగర్‌కర్నూల్ |
| సయ్యద్ నజీముద్దీన్ | మహబూబ్‌నగర్ | నారాయణపేట |
| జిక్కి బాబు ఎన్ | గద్వాల | మహబూబ్‌నగర్ |
| వీ ఆచారి | నాగర్‌కర్నూల్ | నారాయణపేట |
| కే గోపాల్ నాయక్ | మహబూబ్‌నగర్ | వనపర్తి |

## అక్రమ గోవా మద్యం పట్టివేత



అక్రమ మద్యం పట్టివేసిన పోలీసులు

**కృష్ణ, జూలై 6, ప్రభాత వార్త :** కృష్ణా చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా కర్ణాటక , గోవా నుంచి మద్యం తీసుకొస్తున్న అరవింద్ అనే వ్యక్తిని ఆపి కారును తనిఖీ చేయగా కారులో 14 మద్యం బాటిళ్లు ఉన్నాయని గుర్తించి సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి కారును సీజ్ చేసినట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..కమిషనర్ మహ్మద్ ముషారఫ్ ఆదీ,షారుఖ్ బీ ఆదేశాల అనుసారం చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేస్తుండగా కర్ణాటక, గోవా నుంచి ఎవరైనా అక్రమంగా ఒక్క మద్యం బాటిళ్లు తీసుకొచ్చినా తక్షణమే అరెస్ట్ చేసి వాహనాలను, సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులు, వాహనదారులు అక్రమ మద్యం తరలిస్తే కఠిక చర్యలు ఉంటాయని ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై బీ వెంకటేశ్వర్లు సిబ్బంది మల్లం గౌడ్,. సమ్మద్ బాషా, యాదగిరి , రజనీకాంత్, మహేశ్ అశ్విన్ పాల్గొన్నారు.

## ధరణి, ఈ -ఫైళ్లపై సమీక్ష

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు ఇంకా స్థలాలు గుర్తించని చోట వెంటనే గుర్తించి ప్రాంగణాలు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. గురువారం నూతన కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జీవోఎంఎస్ నెంబర్ 58, 59 కింద దర ఖాస్తుల విచారణకు బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ ఇండ్ల పట్టాల పంపిణీ కి సంబంధించి సంక్షేమ దినోత్సవంరోజు కొన్ని పట్టాలు పంపిణీ చేసినప్పటికీ మిగిలిన వాటికి సంబంధిత ప్రజాప్రతినిధులు సమ్మతి తీసుకొని వారంలోగా పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అలాగే తర్వాత వచ్చిన ఫారం 6,7,8 తదితర ఫారాలన్నింటీ పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలన్నారు. సమావేశంలో ధరణి, ఇసుక అక్రమ రవాణాపై విధించిన జరిమానాలు ప్రజావాణి, ఈ -ఆఫీస్ ఫైళ్ల పెండింగ్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. అదనపు కలెక్టర్ సీతారామారావు, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీవో అనిల్‌కుమార్, తాసిల్దార్లు, ఏడీ కిషన్‌రావు హాజరయ్యారు.

## ఆర్అండ్ఆర్ పనులకు అవార్డులు పాస్ చేయాలి

- జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోల పథకంపై సమీక్ష

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై6, ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోల పథకం కింద ఉదండాపూర్ వల్లూరు రిజర్వాయర్ల ఆర్అండ్ ఆర్ పరిధిలో నిర్మాణ పనులకు సంబంధించిన అవార్డులను త్వరితగతిన పాస్ చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. గురువారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉదండాపూర్ ఆర్అండ్ ఆర్ పనులపై నిర్వహించిన సమీక్షపై ఆయన మాట్లాడుతూ నిర్మాణాల అవార్డులను త్వరగా పాస్ చేయాలని కోరారు. కలెక్టర్ జిరవినాయక్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు సంబంధింత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశానికి ఆర్అండ్ ఆర్ డెరెక్టర్ రూఫస్ దత్తం, ఓఎస్డీ మనోహర్, అదనపు కలెక్టర్ సీతారామారావు, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీవో అనిల్‌కుమార్, ప్రాజెక్టు ఇంజినీర్లు, తాసిల్దార్ లక్ష్మీనారాయణ హాజరయ్యారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## కప్పులో.. కిక్కు..!

- తరతరాలుగా ఉత్తేజపరుస్తున్న పానీయం
- జీవితంతో ముడిపడిన చాయ్



తయారు చేసిన చాయ్



తయారు చేసిన లెమన్‌టీ

**దేవరకద్ర, జూలై6, ప్రభాతవార్త:** ఒక్క సిప్ చాలు నిశ్శబద్ధం అంతా మటుమాయమైపోతుంది. అంతే కాదు బాడీ ఒక్కసారిగా రిలాక్స్ అవుతుం ది. ఈ మహత్యం అంతా ఒక కప్పు చాయ్‌కే దక్కుతుంది. ఉదయం లేచింది మొదలు పడుకునే వరకు చాయ్ లేని లైఫ్ ఊహించుకోవడం చాలా కష్టం. అన్ని వర్గాల వారిని రంజింపజేసే మధుర పానీయం చాయ్ అని చెప్పవచ్చు, రోడ్డుమీద తిరిగే రిక్షావాలా నుండి బెంజ్ కారుడలో తిరిగే బడా బాబుల వరకు కామన్‌గా తాగే ఏకైక పానీయం చాయ్ ఒకటే. అస్తులు, అంతస్తులకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను తరతరాలుగా ఉత్తేజపరుస్తూ వస్తుంది చాయ్. ఒక కప్పు టీ తాగకుండా మంచం దిగని వారు చాలా మంది ఉన్నారు. అంతే కాదు నిద్రలేచింది మొదలు పడుకోబోయే వరకు 10,15 సార్లు తాగే వారికి కూడా కొదువలేదు. ఎందుకంటే టీలో ఉన్న పవర్ అలాంటిది. టెన్షన్ నుండి రిలాక్స్ కావడానికి టీని మించిన దివ్య ఔషదం లేదంటారు చాయ్ ప్రియులు.

**4వ శతాబ్దంలో ప్రారంభం:** 4వ శతాబ్దంలో ఒ చైనా వైద్యుడి చేతిలో తయారైన నాటి నుండి నేటి వరకు చాయ్‌కున్న ఆదరణ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఎప్పుడు తగ్గిన దాఖలాలే లేవు. రిలాక్స్ కోసం అందరు కామన్‌గా తాగే ఏకైక పానీయం ఒక చాయ్ కావడంతో దేశంలో ఏటా 25 లక్షల కేజీలకు పైగా టీ పొడి అమ్మకం జరుగుతుంది. దీంతో దేశంలో టీ వాడకం ఏ రేంజ్‌లో ఉందో ఇట్టే అర్థమైపోతుంది. ఇదిలా ఉంటే ప్రజలను రంజింపచేసే టీలలో చాలా రకాలు ఉన్నాయి. ఇరానీ టీ, లెమన్ టీ, గ్రీన్ టీ, అలంటీ,తులసి టీ,మసాలా టీ,గులాబీ టీ, పుదీనాటీ ప్రధానంగా ఉన్నాయి. ప్రస్తుతం కరోనా మహమ్మారి కారణంగా గ్రీన్‌టీ, అల్లం టీ, తులసిటీకి బలే డిమాండ్ ఉంది.

**ఇరానీ టీ టేస్టే వేరు:** టీలలో ఎన్ని రకాలు ఉన్నప్పటికి ఇరానీ టీకి ఉన్నంత టెస్ట్ నేటికి కూడా లేదంటారు చాయ్ ప్రియులు, ఇరాన్ వాసులు పరిచయం చేసిన ఈ టీకి అందరు ఎప్పుడో ఫిదా అయిపోయారు. ఈ టీ తాగడానికి చాలా మంది ఆసక్తి కనబరుస్తారు. ఒకప్పుడు కేవలం పట్టణాలలో లభించే ఇలాంటి టీ ఇప్పుడు అన్ని గ్రామాల్లో కూడా దాదాపు దొరుకుతుంది. టీ అధికంగా తాగితే మంచిది కాదని డాక్టర్లు చెబుతున్న సమయానికి టీ లేకుండా ఉంటే బాడీ అంతగా పనిచేయదని చాయ్ ప్రియులు అంటున్నారు. టీ తాగడం వల్లఎక్కడ లేని శక్తి శరీరంలో వస్తుందని, బాడీ రిఫ్రెష్ అవుతుందని వారి నమ్మకం. మెంటల్‌గా రిలీఫ్ అవ్వాలంటే టీకి మించిన మందు ఏది లేదంటున్నారు చాయ్ ప్రియులు. ఉదయాన్నే లేవగానే వేడి వేడి చుక్క నోటిలో పడందే ఆ రోజంతా సాఫీగా సాగదు. చేతిలో పేపర్...నాటి దగ్గర పొగలు కక్కే టీ తాగుతుంటే ఆ మజానే వేరు. ఉద్యోగం చేసే వాళ్లకైనా పని చేసే వారికైన, ఖాళీగా ఉండే వారికైనా కాలక్షేపం చేయాలంటే ముందుగా గుర్తుకు వచ్చేది చాయ్. మన లైఫ్‌లో అంతగా కలిసి పోయింది చాయ్.

**లేవగానే చాయ్ కావాలి : సర్దార్, దేవరకద్ర**

లేవంగానే ముందుగా నాకు చాయ్ కావాలి. చాయ్ తాగకుండా ఉండలేను. భోజనం చేసిన తర్వాత కూడా చాయ్ తాగుతాను. దాదాపు పదేళ్లుగా చాయ్ తాగుతున్న తిన్న తర్వాత కూడా చాయ్ తాగాలి అనిపిస్తుంది.

**చలాకీతనం వస్తుంది. : శ్యామ్, దేవరకద్ర**

చాయ్ తాగితే చలాకితనం అనిపిస్తుంది. పని చేయడానికి ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. అందుకే రోజుకు ఆరు నుండి ఏడు చాయ్‌లు తాగుతాను. చాయ్ తాగని రోజంటూ లేదు.